సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం । 1 । జనవరి । 2025



వాసవీ మాతకు వెండి వడ్డాణం


నిడదవోలు: చినకాశిరేవు శ్రీ వాసవీ కన్యక పరమేశ్వరి తల్లికి వనితా క్లబ్ అధ్యక్షురాలు ఎస్.శిరిష, శ్రీనివాస దంపతులు, రీజినల్ చైర్‌పర్సన్ జె.లక్ష్మి, కోటేశ్వరరావు దంపతులు 100 గ్రాముల వెండి వడ్డాణం అందించారు.



నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి అయినవిల్లి గ్రామానికి చెందిన బుద్ధరాజు వెంకట రమేష్ మంగళవారం రూ.10,116 విరాళం అందజేశారు.

డెల్టాలకు 11,200 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 11,200 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,300, మధ్య డెల్టాకు 2,150, పశ్చిమ డెల్టాకు 5,750 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

నూతన ఉషస్సు కోసం..



రాజమహేంద్రవరంలోని ఓ హోటల్‌లో న్యూ ఇయర్ జోష్



రాజమహేంద్రవరంలో కిటకిటలాడుతున్న స్వీటు షాపు

- కొత్త సంవత్సరానికి ఘన స్వాగతం
- అంబరాన్నంటిన సంబరాలు
- కొంగొత్త ఆలోచనలతో ముందుకు సాగాలంటూ పరస్పర శుభాకాంక్షలు
- సంక్షేమ వసంతం విరబూయాలని ఆశలు

సాక్షి, రాజమహేంద్రవరం: జిల్లా వ్యాప్తంగా నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. తమ ఇంట మరింత ఆనందం నింపాలని ఆకాంక్షిస్తూ.. ప్రజలు శుభాకాంక్షలు, పూజలు, ప్రార్థనలతో కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు యువకులు, ప్రజలు, అధికారులు ఎక్కడికక్కడ రోడ్ల పైకి వచ్చి 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ కేరింతలు కొట్టారు. కేక్‌లు కట్ చేశారు. యువత బీర్లు, కూల్ డ్రింకులు పొంగించి.. డీజేలు పెట్టుకుని స్టెప్పులతో ఉత్సాహంగా గడిపారు.

కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలంటూ పరస్పరం విషెస్ చెప్పుకొన్నారు. ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్ల పరిసరాలు డీజేల శబ్దాలతో మార్మోగాయి. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ స్టెప్పులేసి, అదరగొట్టారు. రాత్రి 12 గంటలు దాటగానే బాణసంచా కాల్చి నూతన సంవత్సరానికి వెల్కమ్ చెప్పారు. 'బైబై 2024.. వెల్‌కం 2025' అంటూ పెద్ద పెట్టున నినదించారు. అపార్ట్‌మెంట్లలో అందరూ కలిపి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. శుభాకాంక్షలు తెలిపేందుకు పలువురు మంగళవారం పెద్ద ఎత్తున బొకేలు, స్వీట్లు కొనుగోలు చేశారు. దీంతో ఆయా షాపులు రద్దీగా మారాయి.

ఎన్నో ఆశలతో..

నూతన సంవత్సరంపై పేద, మధ్యతరగతి ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నేతలు 'సూపర్ సిక్స్' హామీలు ఇచ్చారు. అధికారం చేపట్టి ఏడు నెలలైనా వాటికి నేటికీ అతీగతీ లేదు. వాటి అమలు కోసం ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

- తల్లికి వందనం పథకం కింద పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15 వేల చొప్పున అందజేస్తామని ఎన్నికల సమయంలో కూటమి అధినేతలు ప్రకటించారు. ఇప్పటి వరకూ ఇది అమలుకు నోచుకోలేదు. కొత్త సంవత్సరంలోనైనా దీనిని అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.
- మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం హామీ అమలు పైనా కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. అధికార పగ్గాలు చేపట్టి నెలలు గడుస్తున్నా.. నేటికీ ఒక్క మహిళను కూడా ఉచితంగా బస్సు ఎక్కించిన పాపాన పోలేదు. ఈ ఏడాదైనా ఉచిత బస్సు ప్రయాణం దక్కుతుందా అని మహిళలు ఎదురు చూస్తున్నారు.
- ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 చొప్పున ఇస్తామన్న ఆర్థిక సాయం కొత్త సంవత్సరంలోనైనా అందాలని కోరుకుంటున్నారు.
- యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదా నెలకు రూ.3 వేల భృతి అంజేస్తామన్న కూటమి నేతల హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఈ హామీని ఈ సంవత్సరమైనా అమలు చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.
- పంట సాగు చేసే ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామన్న కూటమి నేతల మాటలు నీటిమూటలుగానే మిగిలిపోయాయి. ఖరీఫ్ ముగిసి, రబీ సీజన్ ప్రారంభమైనా ఈ హామీ అమలుపై ప్రభుత్వం ఏ విషయమూ స్పష్టం చేయలేదు. ఫలితంగా సాగుకు రైతులు అప్పులు చేసి పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. ఈ ఏడాదైనా పెట్టుబడి సాయం అందజేయాలని రైతులు ఆశ పడుతున్నారు.



ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం



ప్రజలకు, పోలీసులకు మధ్య సామరస్య, స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తాం. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం తీసుకువస్తాం. 2025లో నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. డ్రోన్, సీసీ కెమెరాల వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం. మహిళలు, పిల్లలపై అఘాయిత్యాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. డ్రగ్స్, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌పై ప్రత్యేక నిఘా పెడతాం. నియంత్రణకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించుతాం. మహిళల భద్రతకు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహిళా రక్షక్‌ను మరింత విస్తృతం చేస్తాం. పేకాట, కోడిపందేలపై ఉక్కుపాదం మోపుతాం. ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేలా చర్యలు తీసుకుంటాం. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

– డి.నరసింహ కిశోర్, జిల్లా ఎస్పీ

జిల్లా అభివృద్ధికి కృషి



సమన్వయంతో జిల్లా అభివృద్ధికి, పారిశ్రామికాభివృద్ధికి కృషి చేస్తున్నాం. భారీ, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తాం. కొవ్వూరు – పోలవరం నేషనల్ హైవే పనులను పట్టాలెక్కిస్తాం. కోళ్ల పెంపకంపై ఫోకస్ పెడతాం. స్వయం సహాయక సంఘాల ద్వారా స్వయం ఉపాధికి బాటలు వేస్తాం. పర్యాటక రంగానికి ప్రాధాన్యం కల్పిస్తాం. కడియం నర్సరీలకు పర్యాటకంగా మరింత గుర్తింపు తెచ్చేందుకు ప్రణాళికలు రూపొందించాం. పాఠశాలల్లో మౌలిక వసతులు బాగున్నాయి. విద్యా ప్రమాణాలపై ఫోకస్ పెట్టి ఉత్తీర్ణత, అక్షరాస్యత శాతం పెంచుతాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తాం. తాగునీరు, మరుగుదొడ్లు, గోడలపై అందమైన చిత్రాలు ఉండేలా చూస్తున్నాం. ప్రశాంత వాతావరణంలో పిల్లలు చదువుకునేలా ఏర్పాట్లు చేస్తాం. ప్రజలు, అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

– పి.ప్రశాంతి, జిల్లా కలెక్టర్

న్యూస్‌రీల్

రూ.52.46 కోట్లతో బీసీ కార్యాచరణ ప్రణాళిక

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యాన జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.52.46 కోట్లతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రణాళిక కింద వివిధ స్వయం ఉపాధి యూనిట్లు 1,879 ఏర్పాటు చేయాలన్నది లక్ష్యమన్నారు.

మేదర, కుమ్మరి, శాలివాహన కుటుంబాల్లో ముగ్గురి నుంచి ఐదుగురు సభ్యులతో కూడిన గ్రూపులకు ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు. స్వయం ఉపాధి కార్యకలాపాల కింద 1,229 యూనిట్ల ఏర్పాటుకు మూడు స్లాబ్స్ కింద రూ.23.32 కోట్లు అందించనున్నామని వివరించారు. ఇందులో బ్యాంక్ రుణం 50 శాతం కాగా.. బీసీ కార్పొరేషన్ సబ్సిడీ 50 శాతం ఉంటుందని తెలిపారు. అలాగే, ఒక్కో యూనిట్ రూ.5 లక్షల చొప్పున 449 మినీ డెయిరీల ఏర్పాటుకు రూ.22.46 కోట్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఒక్కో యూనిట్ రూ.2 లక్షల చొప్పున 56 గొర్రెలు, మేకల పెంపకం యూనిట్లను రూ.1.12 కోట్లతో ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఇందులో బ్యాంక్ రుణం 50 శాతం, బీసీ కార్పొరేషన్ సబ్సిడీ 50 శాతం ఉంటాయని తెలిపారు. ఒక్కొక్కటి రూ.8 లక్షల చొప్పున రూ.1.92 కోట్లతో 24 జెనరిక్ మెడికల్ ఫార్మసీ యూనిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దీనిలో కూడా బ్యాంకు రుణం 50 శాతం, బీసీ కార్పొరేషన్ సబ్సిడీ 50 శాతం ఉంటాయని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపిక



సుధీర్ కుమార్

బిక్కవోలు: సీనియర్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు బిక్కవోలు గ్రామానికి చెందిన సత్రపు సుధీర్ కుమార్ ఎంపికయ్యాడు. స్థానిక వ్యాయామోపాధ్యాయుడు మానకొండ ధనరాజ్ మంగళవారం ఈ విషయం తెలిపారు. జనవరి 7 నుంచి 13 వరకూ రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగే సీనియర్ జాతీయ స్థాయి పోటీల్లో మన రాష్ట్ర జట్టుకు సుధీర్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. 2017లో జాతీయ స్థాయి అండర్–17 విభాగం, 2018లో సబ్ జూనియర్స్ విభాగం, 2019లో అండర్–19 విభాగంలో స్కూల్ గేమ్స్ పోటీల్లోను, 2020లో జూనియర్స్ విభాగంలో, 2022లో రెండుసార్లు యూత్ నేషనల్స్‌లో సుధీర్ ఆడాడు. క్రమశిక్షణతో కూడిన శిక్షణ వల్లనే సుధీర్ ఈ స్థాయికి వచ్చాడని పూర్వపు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాయామ విద్యా ఉపాధ్యాయ సంఘం, వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి యార్లగడ్డ బంగారాజు, అనపర్తి జోన్ వ్యాయమోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పడాల శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి రాఘవరెడ్డి అన్నారు. సుధీర్‌ను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అభినందించారు.

ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా పెరవలి ఎంపిక



ఎస్పీ నరసింహ కిషోర్ నుంచి అవార్డు అందుకుంటున్న ఎస్సై వెంకటేశ్వరరావు

పెరవలి: జిల్లాలో ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా పెరవలి ఎంపికైంది. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డి.నరసింహ కిషోర్ చేతుల మీదుగా కొవ్వూరు డీఎస్పీ దేవ కుమార్, నిడదవోలు సీఐ పీవీజీ తిలక్, పెరవలి ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు మంగళవారం సంయుక్తంగా ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సిబ్బంది క్రమశిక్షణ, పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులకు సేవలు అందించటంతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, రికార్డుల నిర్వహణ, క్రైం రేటు తగ్గడం, దొంగతనాలపై సకాలంలో చర్యలు చేపట్టి, రికవరీ చేయడంలో పెరవలి పోలీసులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని వివరించారు. ఈ అంశాల ప్రాతిపదికన పెరవలిని జిల్లాలో ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా ఎంపిక చేశామని చెప్పారు.

లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వరరెడ్డి

రాయవరం: ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా డీవీవీ నాగేశ్వరరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని నాగేశ్వరరెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. జిల్లా కార్యవర్గం వివరాలను ఆయన వివరించారు. ఉపాధ్యక్షుడిగా ఎ.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎం.అంబేడ్కర్, ట్రెజరర్‌గా పి.రమేష్, మహిళా కార్యదర్శిగా ఎస్.వి.నాగలక్ష్మి, జాయింట్ సెక్రటరీగా కె.గణేశ్వరరావు, స్టేట్ కౌన్సిలర్‌గా ఎస్‌వీ ప్రసాద్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పూలదండలు వద్దు.. విద్యాసామగ్రి తీసుకురండి

మాజీ మంత్రి తానేటి వనిత

దేవరపల్లి: యర్నగూడెంలోని తన క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనిత తెలిపారు. కార్యాలయం వద్ద ఉదయం నుంచీ నియోజకవర్గ ప్రజలకు, పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటామన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు ఈ వేడుకల్లో పాల్గొనాలని ఆమె కోరారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి వచ్చే ప్రతి ఒక్కరూ పూలదండలు, బొకేలు, శాలువాలు, స్వీట్లు, కేక్‌లు కాకుండా.. నోట్ పుస్తకాలు, పెన్నుల వంటి విద్యా సామగ్రి తీసుకు రావాలని కోరారు. వీటిని పేద విద్యార్థులకు అందించి, వారి ఆనందంలో భాగస్వాములమవుదామని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలకు, పార్టీ శ్రేణులకు వనిత నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఇండియన్ రైఫిల్ షూటింగ్‌కు ఎంపిక



తన్మయిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కరుణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): గత నెల 26న భోపాల్‌లో నిర్వహించిన 67వ నేషనల్ రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆదిత్య విద్యార్థిని పి.సాయి తన్మయి ప్రతిభ చూపి, ఇండియన్ రైఫిల్ షూటింగ్ టీమ్ ట్రైల్స్‌కు అర్హత సాధించింది. ఈ సందర్భంగా ఆమెను కళాశాలలో ప్రిన్సిపాల్ కరుణ మంగళవారం అభినందించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్లకు తోడ్పడతాయని, విద్యార్థి దశ నుంచీ క్రీడల్లో నైపుణ్యం సంపాదించుకోవాలని సూచించారు. సాయి తన్మయిని వైస్ ప్రిన్సిపాల్ నాగ శ్రీకాంత్, పీడీ సత్యవతి అభినందించారు.

జాతీయ రోలర్ స్కేటింగ్‌లో పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులు

జగ్గంపేట: జాతీయ రోలర్ స్కేటింగ్‌లో ఇద్దరు విద్యార్థులకు బంగారు, రజత పతకాలు లభించాయి. తమిళనాడులోని కోయంబత్తూరులో ఇటీవల నిర్వహించిన 62వ జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో జగ్గంపేటకు చెందిన సీరపు హరిప్రియ రెడ్డి, ఆమె సోదరుడు జస్వంత్‌రెడ్డి పాల్గొన్నారు. హరిప్రియరెడ్డి ప్రథమ స్థానంలో నిలిచి, బంగారు పతకం, జస్వంత్‌రెడ్డి రజత పతకం సాధించారు. స్థానిక ప్రైవేటు పాఠశాలలో వీరిద్దరినీ స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అభినందించారు.

మా సామాజిక వర్గానికి అన్యాయం చేస్తే సహించం

- శెట్టిబలిజ నేతల హెచ్చరిక
- జనసేన నాయకులు ల్యాండ్ మాఫియాగా మారారని ఆరోపణ
- ఎమ్మెల్యే స్పందించకపోవడంపై ఆక్షేపణ
- స్థలాల కబ్జా అన్యాయమని ఆవేదన

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): తమ సామాజికవర్గానికి అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని శెట్టిబలిజ సంఘ నేతలు జనసేన నాయకులకు హెచ్చరించారు. తమ సామాజిక వర్గానికి చెందిన గుత్తుల జాన్సన్‌కు చెందిన స్థలాలను జనసేన నాయకులు కబ్జా చేసేందుకు ప్రయత్నించడంపై మండిపడ్డారు. స్థానిక రామారావుపేటలోని శెట్టిబలిజ సంఘ కార్యాలయంలో మంగళవారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో జనసేన విజయానికి తాము ఎంతో కృషి చేశామన్నారు. అటువంటిది తమ వారి స్థలాలను కబ్జా చేస్తున్నా జనసేనకు చెందిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడకపోవడం దారుణమని ఆక్షేపించారు. జాన్సన్ భూమి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న జనసేన నాయకుడు పుల్ల శ్రీరాములుపై గతంలో రౌడీ షీట్ ఉందని, కూటమి ప్రభుత్వం రాగానే దానిని ఎత్తివేశారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ సామాజికవర్గం వారిని టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. పవన్ కల్యాణ్‌పై ఉన్న అభిమానంతో ఆయన బలపర్చిన వ్యక్తులను తాము గెలిపించిన సంగతిని మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఆ పార్టీ నాయకులు చేస్తున్న ఘోరాలపై ఆయన స్పందించకపోవడం చూస్తుంటే ఇవన్నీ ఆయనకు తెలిసే జరుగుతున్నాయని తాము అనుకోవాల్సి ఉంటుందని అన్నారు. శెట్టిబలిజలకు జనసేన పార్టీ కనీసం ఒక్క సీటు, నామినేటెడ్ పోస్టులు ఇవ్వకున్నా తాము పవన్ కల్యాణ్ వెంట నడుస్తున్నామని చెప్పారు. అయినప్పటికీ తమ సామాజికవర్గీయులపై దాడులు, స్థలాలు కబ్జా చేస్తుంటే ప్రతి దాడులకు తాము కూడా సిద్ధమేనని స్పష్టం చేశారు. అధికారం ఉందని సొంత ప్రయోజనాల కోసం ల్యాండ్ మాఫియాలా తయారైన జనసేన నాయకులు వారి పద్ధతులు మార్చుకోవాలని హితవు పలికారు. సంఘ నాయకుడు చొల్లంగి వేణు గోపాల్ మాట్లాడుతూ, తాము గొడవలు కోరుకోవడం లేదని, జాన్సన్ వద్ద ఆ భూమికి సంబంధించి అన్ని పత్రాలూ ఉన్నాయని అన్నారు. శెట్టిబలిజ జన జాగృతి అధ్యక్షుడు రాయుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ, 15 సంవత్సరాలు క్రితం ఇదే స్థలం కోసం గొడవలు జరిగితే తాము వెళ్లి సర్ది చెప్పామన్నారు. ప్రస్తుతం మళ్లీ అదే స్థలం కాజేసేందుకు పుల్ల శ్రీరాములు రావడం దారుణమని మండిపడ్డారు. జాన్సన్ మాట్లాడుతూ, 2008–09లో తాను సర్పవరంలో స్థలం కొన్నానని చెప్పారు. ఇదే స్థలం విషయంపై తాను 15 సంవత్సరాల క్రితం పుల్ల శ్రీరాములుపై కేసు పెట్టానని చెప్పారు. ప్రస్తుతం జనసేన పార్టీ అండతో ఆయన తనపై దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శెట్టిబలిజ సంఘ నాయకులు

కోర్టు మాకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది


సర్పవరం స్థల వివాదంపై పుల్ల గోవిందు

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలోని స్థల వివాదంపై ఆ గ్రామానికి చెందిన పుల్ల గోవిందు, పుల్ల వెంకట రమణ, బత్తుల బాజ్జీ తదితరులు స్పందించారు. సర్పవరం గ్రామంలో వారు మీడియాతో మాట్లాడుతూ, ఈ స్థల వివాదంలో రాజకీయం లేదని, పుల్ల శ్రీరాములు, ఎమ్మెల్యే నానాజీకి సంబంధం లేదని అన్నారు. కోర్టును ఆశ్రయించడంతో 2019లో తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. ఆ స్థలం తమ తండ్రి పుల్ల అయ్యన్నకు 1962 నాటి పూర్వార్జితమని, ఆయన కుమారులు గోవిందు, వెంకట రమణ తెలిపారు. ఏపీఐఐసీ భూ సేకరణ అనంతరం 55 సెంట్ల భూమి ఉండటంతో పాస్‌బుక్ కూడా తమకు ఇచ్చారని, దానిలో కుటుంబ అవసరం నిమిత్తం 39 సెంట్లు అమ్ముకున్నామని, మిగిలిన 16 సెంట్లు 111, 112 సర్వే నంబర్లలో ఉందని వివరించారు. దీనిలో వంగతోట వేసుకునేవారన్నారు. తాము రౌడీయిజం చేస్తున్నామనడం సరికాదన్నారు. దౌర్జన్యంగా స్థలంలోకి సోమవారం ప్రవేశించారని ఆరోపించారు.

సిరుల చామంతి



కాకరపర్రు మార్కెట్లో చామంతి పూలు విక్రయిస్తున్న వ్యాపారులు





పసుపు, తెలుపు చామంతి పూల తోటలు

- లాభాలు పండిస్తున్న పూల సాగు
- నిత్యం ఆదాయం
- జిల్లాలో 3 వేల మందికి ఉపాధి

పెరవలి: నిశిరాత్రి బిగిసిందంటే చాలు.. ఎటు చూసినా.. దట్టంగా పరచుకునే మంచు పరదాలు.. గిలిగింతలు పెట్టే చలిగాలులు.. ఈ అపురూప అనుభవం ప్రతి ఒక్కరికీ తెలిసిందే.. ప్రస్తుత హేమంత రుతువులో.. గోదారి తీరాన ఉండే పల్లెల్లో.. ఇటువంటి ప్రకృతి సౌందర్యం మరింతగా కనువిందు చేస్తూంటుంది. అంతే కాదు.. ఈ శీతల వాతావరణం సొగసైన చామంతి పూలను కుప్పలుతెప్పలుగా విరబూయిస్తూ.. ప్రకృతికి మరింత అందాలను అద్దుతోంది. పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో ఇప్పుడు ఎక్కడ చూసినా రంగురంగుల చామంతి పూలు నేత్రానందకరంగా దర్శనమిస్తున్నాయి.


ఎనలేని డిమాండ్

పూల సాగులో చామంతి పూలకు ఉన్న డిమాండ్ మరి దేనికీ ఉండదు. ఈ పూలు లేనిదే ఏ శుభకార్యక్రమం జరగదంటే అతిశయోక్తి కాదు. శ్రావణం నుంచి ఇంచుమించు చైత్ర మాసం వరకూ వచ్చే పండగలు, ఇళ్లల్లో జరిగే అన్ని శుభకార్యాల్లో చామంతి పూలది విశిష్ట స్థానం. అందుకే పండగల సమయంలో ఒక్కో చామంతి పువ్వు ధర రూ.3 పైగా కూడా పలుకుతూంటుంది. ఏడాది పొడవునా ఈ పూల సాగు జరుగుతున్నా.. సెప్టెంబర్ నుంచి మార్చి వరకూ మంచి నాణ్యమైన పూలు పూస్తాయి. ఆ సమయంలోనే పండగలు, శుభకార్యాలు జరుగుతూండటంతో వీటికి భారీ డిమాండ్ వచ్చి, మంచి ధర లభిస్తోంది. అందుకే జిల్లాలో అవకాశం ఉన్న రైతులు ఈ పూల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. జిల్లాలోని పెరవలి, కొవ్వూరు, చాగల్లు, దేవరపల్లి, నల్లజర్ల, కడియం, రాజమహేంద్రవరం రూరల్ తదితర మండలాల్లోని సుమారు 180 హెక్టార్లలో చామంతి పూల సాగు జరుగుతోంది. పసుపు పచ్చ, ఎరుపు, తెలుపు, పింక్ వర్ణాలతో పాటు చిట్టి చామంతి పూలను కూడా రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు.

రూ.40 వేల వరకూ రాబడి

వాతావరణం అనుకూలించి, దిగుబడి బాగుండి, మార్కెట్‌లో మంచి ధర లభిస్తే రైతుకు లాభాలు పండినట్టే. ఒకవేళ మార్కెట్‌లో తగిన ధర లేకపోయినా నష్టాలు మాత్రం రావు. ఈ ఏడాది మంచి దిగుబడి వచ్చే సమయంలో.. శ్రావణ మాసం ప్రారంభమైంది. అప్పట్నుంచి కిలో చామంతులకు దాదాపు రూ.300 పైనే లభిస్తోంది. సాధారణంగా సమయాన్ని బట్టి కిలో చామంతి పూలకు రూ.150 నుంచి రూ.350 వరకూ ధర పలుకుతుంది. ప్రస్తుతం శీతాకాలం పంట కావడంతో ఎకరం తోట నుంచి కోతకు 80 నుంచి 100 కిలోల వరకూ పూల దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. కిలో రూ.150 ధర లభించినా కోతకు సుమారు రూ.15 వేలు వస్తూండగా కూలీలు, ఎరువుల ఖర్చులు పోనూ రూ.3 వేల నుంచి రూ.4 వేలు మిగులుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వారానికి రెండు కోతలు కోస్తున్నారు. ఐదు నెలల పంట కాలంలో అన్నీ సవ్యంగా ఉంటే ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ ఆదాయం లభిస్తుందని రైతులు చెబుతున్నారు. జిల్లాలో కడియం మండలం కడియపులంక, పెరవలి మండలం కాకరపర్రు గ్రామాల్లో మాత్రమే పూల మార్కెట్లు ఉన్నాయి. ఇక్కడి నుంచే జిల్లా నలుమూలలకు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు పూలు సరఫరా చేస్తారు. జిల్లాలో చామంతి సాగుపై ప్రత్యక్షంగా, పరోక్షంగా 3 వేల మంది ఉపాధి పొందుతున్నారు. రైతులు, కూలీలు, వ్యాపారులు, పూలదండలు కట్టే మహిళలు, పురుషులు, చిరు వ్యాపారులకు పూల సాగుతో ఉపాధి లభిస్తోంది.

అంతా లాభమే..



చామంతి సాగుకు పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ. ఈ పంటను చాలా జాగ్రత్తగా చూడాలి. లేకపోతే మొక్కలు అప్పటికప్పుడే చనిపోతాయి. తెగుళ్లు అధికంగా ఆశిస్తాయి. ఈ పంట వేస్తే అంతా లాభమే తప్ప నష్టం మాత్రం రాదు.

– నున్నం త్రిమూర్తులు, పూలరైతు, కాకరపర్రు, పెరవలి మండలం

సాగు ఇలా..

కొమ్మ కత్తిరింపు ద్వారా చామంతి మొక్కలను ప్రవర్ధనం చేస్తారు. పూల కోత పూర్తయిన తరువాత మొక్కల నుంచి పిలకలు కత్తిరించి నారుమడిలో నాటి కొత్త మొక్కలను సిద్ధం చేస్తారు. అంటుకు అంటుకు మధ్య మూడేసి అడుగుల దూరం ఉంచి నాటుకోవాలి. జూలై నెలలో నాటుకుంటే డిసెంబర్ నుంచి మంచి దిగుబడినిస్తాయి. చామంతి సాగుకు పెట్టుబడి తక్కువే అయినప్పటికీ.. ఈ మొక్కలను చిన్న పిల్లల్లా పెంచాలని రైతులు అంటారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా పంట చేతికి దక్కదు. జాగ్రత్తలు తీసుకుంటే మాత్రం రూపాయికి రూపాయి వస్తుందని చెబుతున్నారు. వీటి సాగుకు ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకూ పెట్టుబడి అవుతుంది. ఒక్కో మొక్క 75 నుంచి 120 వరకూ పూలు పూస్తుంది. ఎకరం తోటలో 5 నుంచి 8 టన్నుల వరకూ పూల దిగుబడి వస్తుంది. అయితే, ఈ పంటకు చీడపీడల బాధ ఎక్కువగానే ఉంటుందని రైతులు చెబుతున్నారు.

ఆదాయం.. ఆనందం..



పూల సాగులో వస్తే భారీగా లాభం వస్తుంది లేదా పెట్టుబడి వస్తుంది. నష్టం మాత్రం రాదు. ఏటా ఏదో ఒక పూల సాగు చేస్తాను. పెట్టుబడి పోను ఎకరానికి సమయాన్ని బట్టి రూ.30 వేల నుంచి రూ.40 వేల ఆదాయం వస్తోంది. పూల సాగుతో ఆదాయం, ఆనందం లభిస్తున్నాయి.

– సంగీతం నారాయణ, పూలరైతు, కాకరపర్రు, పెరవలి మండలం

విహంగాల సోయగం

- గోదారి తీరంలో 400కు పైగా బార్–హెడెడ్ గూస్ జాతి బాతుల సంచారం

ఆలమూరు: గౌతమీ గోదావరిలో వలస జాతి పక్షులు కనువిందు చేస్తున్నాయి. మిలమిల మెరిసే ఇసుక తిన్నెలపై అరుదుగా కనిపించే విహంగాలు శీతాకాలం అతిథులుగా సందడి చేస్తున్నాయి. గోదావరి తీర ప్రాంతాలకు ఏటా సాధారణంగా నవంబర్ నెలలో సందడి చేయాల్సిన బార్ హెడెడ్ గూస్ జాతికి చెందిన పక్షులు ఈ ఏడాది కాస్త ఆలస్యంగా డిసెంబర్ చివరి వారంలో దర్శనమిస్తున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆలమూరు మండలంలోని జొన్నాడ నదీ తీరంలో రెండు రోజుల నుంచి సుమారు 400 పైగా వలస బాతులు సంచరిస్తూ పక్షి ప్రేమికులకు ఆనందాన్ని పంచుతున్నాయి. శీతాకాలంలో కోసిన వరి పొలాలు, చిత్తడి నేలలు వీటికి ఆహార క్షేత్రాలు. బార్ హెడెడ్ గుస్ బాతులుగా పేరొందిన ఈ విహంగాలు సముద్రమట్టానికి 30 వేల అడుగుల ఎత్తులో ఎగురుతాయని పర్యావరణ వేత్తలు, పక్షి ప్రేమికులు చెబుతున్నారు. ఈ వలస పక్షులు సైబీరియా నుంచి బయలుదేరి రోజుకు సరాసరి 1,600 కిలోమీటర్లు ప్రయాణించి గోదావరి తీరంలోకి ప్రవేశించి కొన్ని రోజుల పాటు జీవన సాగించడం ఏటా పరిపాటి. ఈ వలస బాతులు నమ్మశక్యం కాని దూరం ప్రయాణించే పక్షులుగా గుర్తింపు పొందాయి. ఉప్పు నీటి కయ్యలు, మంచినీటి కయ్యలు, నదీ తీరాల్లోనున్న పచ్చిక బయళ్లను గుర్తించి వలస జీవనం సాగిస్తుండటం ఈ జాతి పక్షుల ప్రత్యేకత. ఇటీవల కాలంలో వాతావరణ మార్పులతో పాటు నదీగర్భంలో పర్యావరణ వ్యతిరేక కార్యకలాపాల వల్ల ఈ పక్షుల రాక తగ్గిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కడియం మండలంలోని మాధవరాయుడు పాలెం గ్రామానికి చెందిన ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ఉప్పులూరి సురేష్‌కుమార్ ఈ వలస పక్షులు జీవన గమనాన్ని, సంచారాన్ని తన కెమెరాలో బంధించారు.



స్థానికులకు కనువిందు చేస్తున్న బార్-హెడెడ్ గూస్ జాతి పక్షులు





విద్యుత్ షాక్‌తో కాడెద్దుల మృతి

- సొంత పొలంలో ఖననం చేసి ప్రేమ చూపిన రైతు



విద్యుత్ షాక్‌తో చనిపోయిన కాడెద్దులు

సీతానగరం/రాజానగరం: సీతానగరం మండలం, మిర్తిపాడు శివారులో విద్యుత్ షాక్‌తో రెండు ఎద్దులు మృత్యువాత పడ్డాయి. బండి పై ఇనుప రేకుల బడ్డీని తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలావున్నాయి. రాజానగరం మండలం నరేంద్రపురానికి చెందిన ప్రగడ సుబ్రహ్మణ్యం అనే రైతు వెలుగుబందకు చెందిన కాడికట్టు రైతు దారా ఏసుబాబు అడగడంతో సీతానగరం మండలం కాటవరానికి ఇనుప రేకులతో తయారు చేసిన బడ్డీని తన బండిపై తరలించే క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గమ్యస్థానానికి కొద్ది దూరంలో ఉండగా మిర్తిపాడు శివారు, కాటవరం సమీపంలో రోడ్డు పక్కన కరెంటు స్తంభాలకు వేలాడుతున్న విద్యుత్ లైన్ తీగలు బండిపై ఉన్న బడ్డీ ఇనుప రేకులకు తగిలి, విద్యుత్ షాక్ కొట్టడంతో కాడెద్దులు అక్కడికక్కడే చనిపోయాయి. ఆ సమయంలో బండి పై ఉన్న దారా ఏసుబాబును బండి ముందు పగ్గాలు పట్టుకుని నడుస్తున్న సుబ్రహ్మణ్యం కిందదకు లాగడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. ఘటనా ప్రాంతాన్ని విద్యుత్ శాఖ అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శి, గ్రామ సచివాలయ సిబ్బంది, స్థానిక రాజకీయ నాయకులు సందర్శించి, ప్రమాదం జరిగి తీరును పరిశీలించారు.

జీవనోపాధి పోయింది

ఉన్న కొద్దిపాటి పొలాన్ని సాగు చేసుకుంటూ, బండి ఎద్దుల ద్వారా వచ్చే కిరాయితో కుటుంబాన్ని పోషించుకుంటూ వస్తున్న నరేంద్రపురానికి చెందిన ప్రగడ సుబ్రహ్మణ్యం ఈ ప్రమాదంతో జీవనోపాధిని కోల్పోయాడు. ఎద్దులు చనిపోవడంతో సుమారు రూ.రెండు లక్షల నష్టానికి గురైన అతను తిరిగి ఎద్దులు కొనుగోలు చేయడం అంటే ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా సాధ్యమయ్యే విషయం కాదు. సాటి రైతు బతిమాలడంతో బడ్డీ తరలింపుకు అంగీకరించానని, ఇంతటి నష్టం వాటిల్లుతుందని ఊహించలేదంటూ వాపోతున్నాడు. జరిగిన నష్టానికి విద్యుత్ శాఖ బాధ్యత వహించి, ఆ రైతును ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాగా ఎద్దులపై ఉన్న ప్రేమతో సుబ్రహ్మణ్యం వాటిని నరేంద్రపురానికి తీసుకువచ్చి, తన పొలంలోనే ఖననం చేశాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాళ్లపూడి: మండలంలోని బల్లిపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. తాళ్లపూడి ఎస్సై టి రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం బల్లిపాడు గ్రామానికి చెందిన ఇందుగు మిల్లి కృష్ణయ్య (60) సోమవారం మధ్యాహ్నం గ్రామంలోని చింత చెట్టు సమీపంలో రోడ్డు దాటుతున్న సమయంలో నందమూరు గ్రామానికి చెందిన అరిమిల్లి శ్రీను బైక్‌పై వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. రోడ్డు పై పడిపోవడంతో తలకు బలమైన గాయం అయింది. స్థానికులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోమవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

మహిళ ఆత్మహత్య



వీరవేణి మృతదేహం

ముమ్మిడివరం: అత్తింటి వేధింపులు తాళలేక ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ముమ్మిడివరం మండలం అయినాపురం శివారు చిట్టిచెరువుకు చెందిన మట్ట వీరవేణి(30) ఈ అఘాయిత్యానికి పాల్పడింది. కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన వీరవేణితో ముమ్మిడివరం మండలం అయినాపురం చిట్టిచెరువుకు చెందిన సత్యనారాయణగౌడ్‌తో 2014లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరవేణి భర్త, అత్తమామలు, మరిది వేధింపులకు గురి చేయడంతో ఆరు సంవత్సరాలుగా పుట్టింట్లో ఉంది. సంవత్సరం క్రితం పెద్దలు పంచాయితీ నిర్వహించి సారె, చీర, కొంత నగదు ఇచ్చి మళ్లీ అత్తవారింటికి పంపించారు. సోమవారం రాత్రి వీరవేణి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే వీరవేణి సోదరుడు వంకా సత్తిబాబు తన అక్క ఆత్మహత్య చేసుకోలేదని భర్త, అత్తమామలు హత మార్చి ఉంటారని ఆరోపించాడు. ప్రస్తుతం ఆత్మహత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపారు.

వాడపల్లి వెంకన్నకు నూతన సంవత్సర శోభ



వాడపల్లి వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఆలయం ప్రాంగణంలో 'ఫలం'కరణ

కొత్తపేట: నూతన సంవత్సరం ఆరంభ వేళ కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆలయం తోరణాలు, పుష్పాలు, పండ్లతో శోభాయమానంగా రూపుదిద్దుకుంది. దేవదాయ - ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, వాడపల్లి దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణాన్ని, ధ్వజస్తంభాన్ని, రాజగోపురాన్ని మామిడి తోరణాలు, పుష్పాలు, వివిధ రకాల పండ్లతో విశేషంగా అలంకరించారు. నూతన సంవత్సరం ప్రారంభ వేళ ఆలయానికి వచ్చే భక్తులను సాదరంగా ఆహ్వానిస్తున్నట్టుగా వెంకన్న ఆలయం కనుల వైకుంఠంగా ముస్తాబైంది. స్వామిని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఉత్సాహంగా స్క్వాష్ ఎంపికలు



క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి జార్జి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్–14, 17, 19 విభాగాల్లో రాష్ట్ర స్థాయి స్క్వాష్ ఎంపికలు మంగళవారం కాకినాడ డీఎస్‌ఏ మైదానంలోని స్క్వాష్ కోర్టు ఆవరణలో ఉత్సాహంగా జరిగాయి. ఈ ఎంపికలను జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య ముఖ్య కార్యదర్శి ఎల్.జార్జి ప్రారంభించారు. జార్జి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈ ఎంపికలకు 120 మంది హాజరుకాగా 30 మందిని జాతీయస్థాయికి ఎంపిక చేశామన్నారు. వీరు ఫిబ్రవరిలో ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలలో రాష్ట్రం తరఫున పాల్గొంటారన్నారు. డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, రవికొర్, ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శులు సునీల్, పరశురాం పాల్గొన్నారు.

పరారీలో ఉన్న నిందితుల అరెస్ట్



మీడియాకు వివరాలు తెలుపుతున్న సీఐ

రాజోలు: నకిలీ కరెన్సీ కేసులో పరారీలో ఉన్న నిందితులను పోలీసులు అరెస్ట్ చేసిన వైనమిది. మంగళవారం రాజోలు సర్కిల్ పోలీసు స్టేషన్‌లో సీఐ నరేషకుమార్ మీడియాకు వివరాలు తెలిపారు. రాజోలు పోలీసు స్టేషన్‌లో నమోదైన నకిలీ కరెన్సీ కేసులో మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్టు ఆయన చెప్పారు. పరారీలో ఉన్న కృష్ణాజిల్లా బాపులపాడుకి చెందిన నవులే సత్యనారాయణ అలియాస్ సత్య, ఐ.పోలవరం మండలం కొమరిగిరికి చెందిన జనుపల్లి శ్రీనివాస్‌ను సీఐ నరేష్‌కుమార్‌కు ముందుగా అందిన సమాచారం మేరకు రావులపాలెం మండలం పూజారిపాలెం వద్ద అదుపులోకి తీసుకుని, కొత్తపేట కోర్టులో హాజరు పరిచారు. కోర్టు వారికి 14 రోజులు రిమాండ్ విధించింది. ఒక్కొక్కరి వద్ద రూ.రెండు వేలు (500 నోట్లు నాలుగు) నకిలీ కరెన్సీ నోట్లు స్వాధీనం చేసుకున్నట్టు, రెండు సెల్ ఫోన్లు సీజ్ చేసినట్టు సీఐ తెలిపారు.

కుళ్లిన మృతదేహం గుర్తింపు

అంబాజీపేట: స్థానిక సెంటర్ సమీపంలో సత్యవైన్స్ బిల్డింగ్ పైన గుర్తుపట్టలేనంతగా ఉన్న కుళ్లిన మృతదేహాన్ని పోలీసులు మంగళవారం గుర్తించారు. సుమారు పది రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి వ్యక్తి మృతుడైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యునైటెడ్ హాస్పిటల్ సమీపంలో ఉన్న ఓ భవనంలో సత్య వైన్స్‌ను నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి దుర్వాసన రావడంతో భవనం చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు భవనంపై వైన్స్ సిబ్బంది వెతికారు. భవనంలో ఓ వ్యక్తి విగతజీవిగా పడివుండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దాంతో పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు, ఎస్సై కె.చిరంజీవి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని మృతదేహం భవనంలో పడి ఉందని వాట్సాప్ గ్రూప్‌లలో ప్రజలకు సమాచారం చేరింది. దీంతో మృతుడి భార్య, కుమారుడు ఘటనా స్థలానికి చేరుకుని చనిపోయిన వ్యక్తి అంబాజీపేటకు చెందిన బట్టే ఆనందరావు (45)గా అతను వేసుకున్న టీ షర్టు, లుంగీని పరిశీలించి గుర్తు పట్టారు. పది రోజులుగా తన తండ్రి ఆనందరావు కనిపించడం లేదని అతని కుమారుడు అజిత్ కుమార్ తెలిపాడన్నారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నల్లజర్ల: అనంతపల్లి శివారులో నిర్వహిస్తున్న ఒడిశా దాబాలో వంట పనులు నిర్వహిస్తున్న ఇద్దరు బైక్‌పై సోమవారం రాత్రి తాడేపల్లిగూడెం వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో వీరిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఒడిశాకు చెందిన షేక్ తస్లీం(29)మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో వ్యక్తి ఆసపాద్‌ను మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. ఏఎస్‌ఐ శోభనాద్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి దుర్మరణం



అభిషేక్ (ఫైల్)

ముమ్మిడివరం: మోటారు సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు అదుపు తప్పి పక్కనే ఉన్న అవుట్ ఫాల్ స్లూయిస్‌లో పడి ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ముమ్మిడివరం మండలం వృద్ధ గౌతమీ కుడి ఏటుగట్టు అయినాపురం అవుట్ ఫాల్ స్లూయిస్ వద్ద సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఉప్పల గుప్తం మండలం కామరాజుపేటకు చెందిన పెయ్యల స్టీఫెన్, దోనిపాటి అభిషేక్ మోటారు సైకిల్‌పై యానాం వెళ్లి పని ముగించుకుని తమ స్వగ్రామానికి తిరిగి వస్తుండగా అయినాపురం స్లూయిస్ వద్ద చెట్టును ఢీకొనడంతో అదుపు తప్పి స్లూయిస్‌లో పడిపోయారు. ఈ ప్రమాదంలో స్టీఫెన్ గాయాలతో బయట పడగా దోనిపాటి అభిషేక్ నీటిలో మునిగి పోయాడు. స్థానికులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా స్లూయిస్ గోదావరి పాయలో అభిషేక్ మృతదేహం మంగళవారం ఉదయం లభ్యమైంది. మృతదేహాన్ని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఏహెచ్‌ఓ ఎన్.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవాది మృతికి కారణమైన పోలీసులను శిక్షించాలి



తునిలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తుని: న్యాయవాది బి.వి.శేషాద్రి మృతికి కారణమైన పోలీసులను శిక్షించాలని తుని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సలుగు కృష్ణశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం తుని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపి విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా సలుగు కృష్ణశేఖర్ మాట్లాడుతూ అనంతపురం బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది శేషాద్రిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి మానసికంగా, శారీరకంగా అవమానించి మృతికి కారణమైన త్రీటౌన్ సీఐ, సిబ్బందిని శిక్షించాలన్నారు. న్యాయవాదులు మేడిది గణేష్, చాగంటి వెంకట రాజు, సీహెచ్.వెంకటరమణ, ఆర్.వెంకట్రావు, లోవకుమారి, రాజేష్ బాలాజీరావు, యనమల సతీష్, బర్ల రవికుమార్, తాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్షరాస్యతను పెంపొందించేందుకు ఉల్లాస్

ఆలమూరు: సమాజంలో అందరికీ జీవితకాలంలో అక్షరాస్యతను పెంచే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ (ఉల్లాస్) అనే వయోజన విద్యను గ్రామాల్లో నిరక్షరాస్యులకు అందించాలని ప్రత్యేక నోడల్ అధికారి జి. విజయ భాస్కర్ అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఏ రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావుతో కలిసి నోడల్ అధికారి విజయ భాస్కర్ మంగళవారం ఉల్లాస్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు, ఐ.పోలవరం, ఆత్రేయపురం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాట్రేనికోన, మండపేట, రాయవరం మండలాల్లో గుర్తించిన 7,128 మందిని అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. నిరక్షరాస్యులకు రాత్రి వేళల్లో విద్యను అందించేందుకు గ్రామ యానిమేటర్ల సహకారంతో 64 మందిని స్వచ్ఛంద మహిళ విద్యా బోధకులను నియమించామన్నారు. అక్షరాస్యత కార్యక్రమంలో నిరక్షరాస్యులుగా గుర్తించిన వారందరికి తొలుత ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యల విలువను తెలియజేయనున్నట్లు తెలిపారు. అనంతరం దశల వారీగా అభ్యాసక వాచకాల ద్వారా బోధనలతో పాటు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, క్రియాత్మక అక్షరాస్యతను వీడియోల రూపంలో లబ్ధిదారులకు అందించనున్నామన్నారు.

వరుణ్ వీరోచిత సెంచరీ

82 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 109 నాటౌట్

- తిలక్ వర్మ 99 అవుట్
- కర్ణాటకపై హైదరాబాద్ గెలుపు
- మయాంక్ అగర్వాల్ శతకం వృథా


వరుణ్

అహ్మదాబాద్: భారీ లక్ష్యం ముందున్నా... ఆందోళన చెందకుండా సంయమనంతో ఆడిన హైదరాబాద్ జట్టు విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీలో కర్ణాటక జట్టుపై మూడు వికెట్ల తేడాతో అద్భుత విజయం అందుకుంది. చివరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో హైదరాబాద్ రెండు బంతులు మిగిలి ఉండగా లక్ష్యాన్ని ఛేదించింది. వరుణ్ గౌడ్ (82 బంతుల్లో 109 నాటౌట్; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ శతకంతో హైదరాబాద్ జట్టును గెలిపించాడు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న కర్ణాటక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 320 పరుగులు చేసింది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (112 బంతుల్లో 124; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) మరో సెంచరీతో చెలరేగగా... స్మరణ్ (75 బంతుల్లో 83; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. హైదరాబాద్ బౌలర్లలో చామా మిలింద్ 3 వికెట్లు పడగొట్టగా... అనికేత్ రెడ్డి 2 వికెట్లు తీశాడు. ముదస్సిర్, రోహిత్ రాయుడులకు ఒక్కో వికెట్ లభించింది. లక్ష్యఛేదనలో హైదరాబాద్ 49.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ తిలక్ వర్మ (106 బంతుల్లో 99; 7 ఫోర్లు, 1 సిక్స్) పరుగు తేడాతో శతకం చేజార్చుకోగా... వరుణ్ గౌడ్ వీరవిహారం చేశాడు. తిలక్, వరుణ్ ఐదో వికెట్‌కు 112 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కబెట్టారు. కీలక సమయంలో తిలక్ వెనుదిరిగినా... చివరి వరకు క్రీజులో నిలిచిన వరుణ్ గౌడ్ భారీ షాట్లతో విరుచుకుపడి జట్టును గెలిపించాడు. తనయ్ త్యాగరాజన్ (17 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్), వరుణ్ ఏడో వికెట్‌కు 71 పరుగులు జోడించారు. చివరి ఓవర్ తొలి బంతికి తనయ్ అవుటైనా... చామా మిలింద్ (4 నాటౌట్)తో కలిసి వరుణ్ హైదరాబాద్‌ను విజయతీరాలకు చేర్చాడు. కర్ణాటక బౌలర్లలో ప్రవీణ్ దూబే, నికిన్ జోస్ చెరో రెండు వికెట్లు తీశారు. వరుణ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. తమ తదుపరి మ్యాచ్‌లో శుక్రవారం పంజాబ్‌తో హైదరాబాద్ ఆడుతుంది.



వారెవ్వా వైశాలి

న్యూయార్క్: భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి రమేశ్‌బాబు 'ఫిడే' వరల్డ్ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. టోర్నీ తొలి రోజు మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ దశలో 11 గేమ్‌లలో కలిపి ఆమె మొత్తం 9.5 పాయింట్లతో అగ్ర స్థానంలో నిలిచింది. 8 గేమ్‌లు గెలిచిన వైశాలి 3 గేమ్‌లను 'డ్రా' చేసుకుంది. తొలి నాలుగు గేమ్‌లను వరుసగా గెలుచుకొని 23 ఏళ్ల వైశాలి శుభారంభం చేసింది. ఐదో గేమ్‌లో ఆమెకు రష్యాకు చెందిన మాజీ బ్లిట్జ్ వరల్డ్ చాంపియన్ కేటరీనా లాగ్నోతో గట్టి పోటీ ఎదురైంది. హోరాహోరీ సమరం తర్వాత ఈ గేమ్ 'డ్రా'గా ముగిసింది. ఆ తర్వాత వైశాలి వరుసగా ఆరు, ఏడు, ఎనిమిదో గేమ్‌లలో విజయాలు సొంతం చేసుకుంది. ఎనిమిదో రౌండ్‌లో ప్రస్తుత వరల్డ్ బ్లిట్జ్ చాంపియన్ వలెంటినా గునీనా (రష్యా)పై గెలవడం ఆమె ముందంజ వేయడంలో కీలకంగా మారింది. 9వ రౌండ్‌ను 'డ్రా'గా ముగించుకున్న అనంతరం పదో గేమ్‌లో పొలినా షువలోవా (రష్యా)ను ఓడించడంతో వైశాలికి అగ్ర స్థానం ఖాయమైంది. దాంతో అమెరికాకు చెందిన కారిసా ఇప్‌తో జరిగిన 11వ గేమ్‌ను చకచకా 9 ఎత్తుల్లోనే 'డ్రా' చేసుకొని వైశాలి క్వాలిఫయింగ్ దశలో నంబర్‌వన్‌గా నిలిచింది. మొత్తం 8 మంది ప్లేయర్లు క్వార్టర్ ఫైనల్ (నాకౌట్) దశకు అర్హత సాధించారు. క్వార్టర్ ఫైనల్లో జు జినర్ (చైనా)తో వైశాలి తలపడుతుంది. మరోవైపు వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ కోనేరు హంపి నాకౌట్‌కు చేరలేకపోయింది. 11 రౌండ్‌ల తర్వాత మొత్తం 8 పాయింట్లతో ఆమె 9వ స్థానంతో ముగించింది. 8 గేమ్‌లను గెలిచిన హంపి...మరో 3 గేమ్‌లలో పరాజయం పాలైంది. ఎనిమిదో రౌండ్‌లో మరో భారత ప్లేయర్ దివ్య దేశ్‌ముఖ్ చేతిలో అనూహ్యంగా ఓడటం హంపి అవకాశాలను దెబ్బ తీసింది. ఇతర భారత క్రీడాకారిణులు దివ్య దేశ్‌ముఖ్ (7 పాయింట్లు) 18వ ర్యాంక్‌లో, వంతిక అగర్వాల్ (7 పాయింట్లు) 19వ ర్యాంక్‌లో, ద్రోణవల్లి హారిక (7 పాయింట్లు) 22వ ర్యాంక్‌లో, నూతక్కి ప్రియాంక (5 పాయింట్లు) 70వ ర్యాంక్‌లో, పద్మిని రౌత్ (5 పాయింట్లు) 71వ ర్యాంక్‌లో, సాహితి వర్షిణి (4.5 పాయింట్లు) 76వ ర్యాంక్‌లో నిలిచారు. పాయింట్లు సమంగా ఉన్నపుడు మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరిస్తారు.

అర్జున్‌కు నిరాశ...

పురుషుల (ఓపెన్) విభాగంలో భారత ఆటగాళ్లలో ఎవరూ క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయారు. మొత్తం 13 రౌండ్‌ల తర్వాత భారత్ నుంచి అత్యుత్తమంగా ఆర్.ప్రజ్ఞానంద 8.5 పాయింట్లతో 23వ స్థానంతో ముగించగా, రౌనక్ సాధ్వానికి 35వ స్థానం (8 పాయింట్లు) దక్కింది. తెలంగాణకు చెందిన అర్జున్ ఇరిగేశి 7 పాయింట్లు మాత్రమే సాధించి 64వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. తొలి 5 గేమ్‌లలో గెలిచి అగ్రస్థానంతో ముందుకు దూసుకుపోయిన అర్జున్‌కు ఆ తర్వాత అనూహ్య ఫలితాలు ఎదురయ్యాయి. తర్వాతి 5 రౌండ్‌లలో 2 ఓడి, 2 'డ్రా' చేసుకున్న అతను ఒకటే గేమ్ గెలవగలిగాడు. ఆఖరి 3 రౌండ్‌లలో వరుసగా అనీశ్ గిరి (నెదర్లాండ్స్), డెనిస్ లజావిక్ (రష్యా), కజిబెక్ నొగర్‌బెక్ (కజకిస్తాన్)ల చేతుల్లో ఓడటంతో రేసులో అర్జున్ పూర్తిగా వెనుకబడిపోయాడు.

శ్రీకర్ భరత్, అశ్విన్ అజేయ సెంచరీలు

- మేఘాలయపై 10 వికెట్లతో ఆంధ్ర ఘనవిజయం
- 5 వికెట్లు పడగొట్టిన సందీప్
- విజయ్ హజారే ట్రోఫీ టోర్నీ


సందీప్


అశ్విన్ శ్రీకర్ భరత్

ముంబై: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్ర జట్టు జోరు కొనసాగుతోంది. గ్రూప్ 'బి'లో భాగంగా ఆంధ్ర జట్టు నాలుగో విజయం ఖాతాలో వేసుకుంది. మంగళవారం జరిగిన పోరులో ఆంధ్ర 10 వికెట్ల తేడాతో మేఘాలయను మట్టికరిపించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన మేఘాలయ జట్టు 48.2 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ నిశాంత చక్రవర్తి (108 బంతుల్లో 101; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా... అర్పిత్ (90 బంతుల్లో 66; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో రాణించాడు. దీంతో ఒకదశలో మేఘాలయ జట్టు 182/1తో పటిష్ట స్థితిలో కనిపించింది. అయితే ఆ తర్వాత ఆంధ్ర బౌలర్లు విజృంభించి వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టారు. దీంతో మేఘాలయ బ్యాటర్లు ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఆంధ్ర బౌలర్లలో యారా సందీప్ 28 పరుగులిచ్చి 5 వికెట్లతో అదరగొట్టగా... ఆంజనేయులు, మహీప్ కుమార్ రెండేసి వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆంధ్ర 29.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 228 పరుగులు చేసింది. ఆంధ్ర కెప్టెన్ శ్రీకర్ భరత్ (81 బంతుల్లో 107 నాటౌట్; 9 ఫోర్లు, 7 సిక్స్‌లు) సెంచరీతో విజృంభించాడు. మరో ఓపెనర్ అశ్విన్ హెబర్ (96 బంతుల్లో 108 నాటౌట్; 13 ఫోర్లు, 1 సిక్స్) కూడా 'శత'క్కొట్టడంతో ఆంధ్ర జట్టు ఆడుతూ పాడుతూ లక్ష్యాన్ని ఛేదించింది. మేఘాలయ బౌలింగ్‌ను ఓ ఆటాడుకున్న భరత్... సిక్స్‌లతో చెలరేగిపోతే అశ్విన్ బౌండరీలతో హోరెత్తించాడు. వీరిద్దరూ పోటీపడి పరుగులు రాబట్టడంతో లక్ష్యం చిన్నబోయింది. గత మ్యాచ్‌లో సర్వీసెస్‌పై అజేయ అర్ధశతకాలతో వికెట్ నష్టపోకుండానే జట్టును గెలిపించిన భరత్, అశ్విన్... ఈసారి కూడా దాన్ని పునరావృతం చేశారు. 5 వికెట్లు తీసిన సందీప్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. గ్రూప్‌లో ఇప్పటి వరకు 5 మ్యాచ్‌లాడిన ఆంధ్ర జట్టు 4 విజయాలు, ఒక పరాజయంతో 16 పాయింట్లు ఖాతాలో వేసుకొని రెండో స్థానంలో కొనసాగుతోంది. తదుపరి మ్యాచ్‌లో శుక్రవారం మహారాష్ట్రతో ఆంధ్ర జట్టు తలపడుతుంది.

పశ్చిమ బెంగాల్ 33వసారి...

- సంతోష్ ట్రోఫీ టైటిల్ సొంతం
- ఫైనల్లో కేరళపై విజయం

సాక్షి, హైదరాబాద్: జాతీయ సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ సంతోష్ ట్రోఫీలో 33వసారి పశ్చిమ బెంగాల్ జట్టు చాంపియన్‌గా అవతరించింది. మంగళవారం జీఎంసీ బాలయోగి స్టేడియంలో హోరాహోరీగా సాగిన తుదిపోరులో పశ్చిమ బెంగాల్ జట్టు 1–0 గోల్ తేడాతో కేరళ జట్టుపై విజయం సాధించింది. పశ్చిమ బెంగాల్ తరఫున రోబీ హన్స్‌దా (90+4వ నిమిషంలో) ఏకైక గోల్ చేసి జట్టుకు టైటిల్ అందించాడు. ఆదిత్య థాపా కొట్టిన హెడర్‌ను బాక్స్‌కు సమీపంలో అందుకున్న రోబీ... సునాయాసంగా ప్రత్యర్థి పోస్ట్‌లోకి పంపాడు. ఆ తర్వాత స్కోరు సమం చేసేందుకు కేరళ జట్టు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గ్రూప్ దశలో అత్యుత్తమ ప్రదర్శనతో పరాజయం ఎరగకుండా ఫైనల్‌కు చేరిన ఇరుజట్ల మధ్య ఉత్కంఠ భరిత సమరం జరగగా... చివరకు పశ్చిమ బెంగాల్‌నే విజయం వరించింది.

2025 స్పోర్ట్స్ క్యాలెండర్
మరిన్ని క్రీడా వార్తలు | సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా


● ఎన్టీఆర్ ● ప్రభాస్ ● మహేశ్ బాబు

విదేశాల్లో 2025

2024కి బై చెప్పి... 2025కి వెల్‌కమ్ చెప్పడానికి అందరూ సెలబ్రేషన్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. కొందరు స్టార్స్ అయితే కొత్త సంవత్సరం జరుపుకోవడానికి విదేశాలు వెళ్లారు. షూటింగ్స్‌కి కాస్త విరామం దొరకడంతో వెకేషన్ ప్లాన్ చేసుకునే అవకాశం ఈ స్టార్స్‌కి దక్కింది. వారి ఈ వెకేషన్ గురించి తెలుసుకుందాం...


● కుటుంబ సభ్యులతో ఎన్టీఆర్

ఈ ఏడాది మహేశ్‌బాబు ఇప్పటికే రెండుసార్లు జర్మనీ వెళ్లొచ్చారు. అయితే ఇది హాలిడే ట్రిప్ కాదు. రాజమౌళి దర్శకత్వంలో రూపొందనున్న సినిమా ప్రిపరేషన్‌లో భాగంగా జర్మనీ వెళ్లారని చెప్పుకోవచ్చు. అయితే ప్రతి ఏడాది మహేశ్‌బాబు న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ ఫారిన్‌లో జరుగుతుంటాయి. ఈ ఏడాది కూడా ఫారిన్‌లోనే మహేశ్‌బాబు ప్లాన్ చేశారని సమాచారం. మహేశ్‌బాబు మోస్ట్‌లీ యూరప్‌కు వెళ్లనున్నారట.

ఇక ప్రభాస్ ఆల్రెడీ యూరప్‌లో ఉన్నారని తెలిసింది. ఇటీవల ఓ సినిమా చిత్రీకరణలో భాగంగా ప్రభాస్ కాలికి గాయమైంది. వైద్యుల సూచనల మేరకు ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. యూరప్‌లోనే విశ్రాంతి తీసుకుంటున్నారని, ప్రభాస్ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ అక్కడే అని టాక్. విదేశాల నుంచి తిరిగొచ్చిన తర్వాత 'రాజా సాబ్, ఫౌజి' చిత్రీకరణలో పాల్గొంటారు ప్రభాస్. ఈ సినిమాల చిత్రీకరణలు ఓ కొలిక్కి వచ్చిన తర్వాత 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగాతో 'స్పిరిట్' చిత్రాన్ని ఆరంభిస్తారు ప్రభాస్. ఇక 'దేవర' సక్సెస్ జోష్‌లో ఉన్నారు ఎన్టీఆర్. ప్రస్తుతం ఎన్టీఆర్ హిందీలో స్ట్రయిట్ ఫిల్మ్ 'వార్ 2' (ఈ చిత్రంలో హృతిక్ రోషన్ మరో హీరో) లో నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాకు చెందిన ఓ లెంగ్తీ షూట్‌ను పూర్తి చేశారు. ఆ తర్వాత ఫ్యామిలీతో కలిసి లండన్ వెళ్లారని తెలిసింది. సో... ఎన్టీఆర్ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ లండన్‌లోనే అని ఊహించవచ్చు. లండన్ నుంచి తిరిగొచ్చిన తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) షూటింగ్‌తో ఎన్టీఆర్ బిజీ అవుతారట. ఇంకా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం హీరోయిన్ పూజా హెగ్డే స్పెయిన్ వెళ్లారు. రష్మికా మందన్నా ఆల్రెడీ ఫారిన్‌లోనే ఉన్నారని తెలిసింది. హీరోయిన్ తమన్నా, ఫరియా అబ్దుల్లా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌ను అమెరికాలో ప్లాన్ చేశారని తెలిసింది. వీరితో పాటు మరి కొందరు టాలీవుడ్ యాక్టర్స్ గోవా, మాల్దీవ్స్‌లో వేడుకలు ప్లాన్ చేశారని సమాచారం.


● సరిత, నయనతార, విఘ్నేశ్, మాధవన్

భర్త విఘ్నేష్ శివన్‌తో నయనతార దుబాయ్ వెళ్లారు. అక్కడే మాధవన్, ఆయన భార్య సరిత కూడా ఉన్నారు. సో... ఈ రెండు ఫ్యామిలీస్ ఒకే చోట వేడుక చేసుకోనున్నారు. కలిసి ఉన్న ఫొటోను కూడా షేర్ చేశారు. అలాగే బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ కూడా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ స్పాట్‌గా దుబాయ్‌నే ఎంచుకున్నారు. ఇంకా ఫ్యామిలీతో కలిసి దియా మీర్జా శ్రీలంక వెళ్లారు. అర్జున్ రాంపాల్ సెలబ్రేషన్స్ గోవాలో జరుతాయని సమాచారం. ఫ్యామిలీతో కలిసి కరీనా కపూర్ స్విట్జర్లాండ్‌లో, శిల్పాశెట్టి లండన్‌లో, భర్త జహీర్ ఇక్బాల్‌తో కలిసి హీరోయిన్ సోనాక్షీ సిన్హా ఆస్ట్రేలియాలో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ జరుపుకోనున్నారు. 'యానిమల్' ఫేమ్ త్రిప్తీ దిమ్రీ ఫిన్‌ల్యాండ్ వెళ్లారు.

ఓ వెన్నెల...

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ప్రముఖ దర్శకుడు శంకర్ కుమార్తె అదితీ శంకర్ హీరోయిన్. ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించారు. ఈ నెల 3న బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'భైరవం' మూవీ నుంచి 'ఓ వెన్నెల..' అంటూ సాగే పాటని రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న చిత్రం 'భైరవం'. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ఫస్ట్ లుక్ పోస్టర్స్ మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి'' అని చిత్రబృందం పేర్కొంది.


● సాయి శ్రీనివాస్, అదితీ శంకర్

2024ని మంచి సినిమాతో ముగించాను

- జాన్వీ కపూర్



''అమరన్' సినిమాని కాస్త ఆలస్యంగా చూశాను. అయితే 2024 సంవత్సరాన్ని ఇలాంటి ఒక అద్భుతమైన, ఒక మంచి సినిమా చూసి ముగించినందుకు చాలా సంతోషంగా ఉంది'' అని హీరోయిన్ జాన్వీ కపూర్ అన్నారు. శివ కార్తికేయన్, సాయిపల్లవి జోడీగా నటించిన ద్విభాషా చిత్రం (తమిళ్, తెలుగు) 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించారు. 2014లో జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. దీపావళి కానుకగా 2024 అక్టోబరు 31న విడుదలైంది. ఈ మూవీ తెలుగు, తమిళ భాషల్లో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అంతేకాదు.. ఈ చిత్రంపై ఇప్పటికే ఎంతోమంది స్టార్స్ కూడా ప్రశంసలు కురిపించారు. తాజాగా జాన్వీ కపూర్ కూడా 'అమరన్' మూవీపై తన ఇన్‌స్టాగామ్ ద్వారా ప్రశంసలు కురిపించారు. ''అమరన్' సినిమాని నేను చూడడం ఆలస్యమైంది. కానీ, ఎంతో అద్భుతమైన సినిమా. ప్రతి సన్నివేశం చాలా భావోద్వేగంతో నిండిపోయింది. ఈ ఏడాదికి 'అమరన్' బెస్ట్ మూవీ. ఈ చిత్రం నా హృదయాన్ని కదిలించింది. ఈ సినిమాలోని సన్నివేశాలు నా హృదయాన్ని బరువెక్కించాయి. ఓ ప్రేక్షకురాలిగా 2024ని ఇలాంటి ఒక మంచి సినిమాతో ముగించడం సంతోషంగా ఉంది'' అని పోస్ట్ చేశారామె. కాగా ఎన్టీఆర్ 'దేవర' మూవీతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ ప్రస్తుతం రామ్‌చరణ్‌కి జోడీగా నటిస్తున్నారు.

గుండె జారిపోయిందే!


వరుణ్ రాజ్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'పోకిరి'. వికాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మమత హీరోయిన్. ప్రమోద్ రాజు సమర్పణలో రాజా మూవీస్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. కాగా వరుణ్ రాజ్ పుట్టినరోజు సందర్భంగా 'పోకిరి' నుంచి 'గుండె జారిపోయిందే..'. అంటూ సాగే మొదటి పాటని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో–నిర్మాత వరుణ్ రాజ్ మాట్లాడుతూ– ''పోకిరి' టైటిల్‌లోనే దమ్ముంది. ఈ సినిమాతో హిట్ సాధిస్తామనే నమ్మకం ఉంది. 'పోకిరి' సినిమాకి ఓనర్ మహేశ్‌బాబుగారే. మేమంతా ఆయన అభిమానులం అంతే'' అన్నారు. ''ఈ మూవీ స్టోరీ లైన్ రాసుకున్నప్పటి నుంచి 'పోకిరి' అనే టైటిల్ అనుకున్నాం'' అని వికాస్ చెప్పారు. ''పోకిరి' నా తొలి సినిమా'' అని పేర్కొన్నారు మమత. సంగీత దర్శకుడు ఉదయ్ కిరణ్ మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: వెంకీ–వంశీ.


● వరుణ్ రాజ్, మమత

ఓటీటీ ఇది చూడొచ్చు

సీక్రెట్స్ ఆఫ్ ఆర్ఆర్ఆర్ బై రాజమౌళి

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో ఆర్ఆర్ఆర్ - బిహైండ్ అండ్ బియాండ్ ఒకటి. ఈ డాక్యుమెంటరీ గురించి తెలుసుకుందాం.



తన ఉనికిని తెలిపేందుకు ఓ గదిలో నలుగురు ముందు చప్పట్లు కొడితే ఆ నలుగురికి తన విషయం తెలియవచ్చు. కానీ అదే ఉనికి ప్రపంచానికి తెలియాలంటే సరిగ్గా రాజమౌళిలా ఆలోచించాలి. భారత దేశానికి ఒకప్పుడు సినిమా ప్రమోషన్‌ను ఓ వినూత్న పంథాలో పరిచయం చేసిన బాలీవుడ్ దిగ్గజం అమిర్ ఖాన్ కూడా తాను ఈ విషయంలో రాజమౌళినే ఫాలో అవుతాననడం దీనికి ఓ నిదర్శనం. చరిత్ర అనేది రాజమౌళి ముందు ఉన్నది తరువాత ఉంటుంది. కానీ ఆ చరిత్రలో రాజమౌళికి ఓ చెరగని పేజీ ఉంటుందనేది మాత్రం నిర్వివాదాంశం. తెలుగు సినిమా వైభవాన్ని ఎన్నో అంతర్జాతీయ వేదికలపైన నిలిపిన శిల్పి రాజమౌళి. మరీ ముఖ్యంగా తెలుగు సినిమాకి ఆస్కారమే లేదన్న ఆస్కార్ పురస్కారాన్ని అద్భుతంగా అందించిన అత్యున్నత దర్శకులు రాజమౌళి. తన సినిమా అంటేనే ఓ సంచలనం. మరి... ఆ సంచలనం వెనకున్న సీక్రెట్ తెలుసుకోవాలని ప్రతి దర్శకుడితో పాటు సామాన్య ప్రేక్షకుడికి కూడా ఆసక్తి ఉంటుంది. ఆ కోవలోనే రాజమౌళి తీసిన 'ఆర్ఆర్ఆర్' సినిమాకి సంబంధించిన తన కష్టాన్ని ఓ చక్కటి డాక్యుమెంటరీ రూపంలో 'ఆర్ఆర్ఆర్ – బిహైండ్ అండ్ బియాండ్' పేరిట నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉంచారు. దాదాపు రెండున్నర గంటల పై నిడివి ఉన్న 'ఆర్ఆర్ఆర్' సినిమాను నాలుగేళ్ల పాటు తీశారు. ఈ డాక్యుమెంటరీలో ఆ సినిమా మొత్తాన్ని ఎలా తీశారో రాజమౌళి వ్యాఖ్యానంతో పాటు సినిమాలోని నటీనటులు టెక్నీషియన్స్ కూడా వివరిస్తూ చూపించడం ఎంతో బాగుంది. తన ఈ 'ఆర్ఆర్ఆర్' ప్రయాణానికి సంబంధించి ఎన్నో తెలియని, చూడని అద్భుత విషయాలను ప్రేక్షకులకు అందంగా అందించారు. ఇక్కడ ఇంకో విషయం చెప్పుకోవాలి... ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన ఫుటేజ్ కొన్ని గంటల రూపంలో ఉంటే దానిని ఎడిట్ చేసి, గంటన్నర నిడివితో అందించారట. ఈ సమాజమనేది ఓ సృష్టి. ప్రతిరోజూ మన మనుగడ ఈ సృష్టికి అనుగుణంగానే ఉంటుంది. ఓ రకంగా సినిమా అన్నది కూడా ఓ సృష్టి. ఓ దర్శకుడి ఆలోచనకు ప్రతిరూపమే సినిమా అన్న ఓ అద్భుత సృష్టి. కానీ ఈ సినిమా సృష్టిలో ఎంతోమంది కష్టం ఉంటుంది. మరి... అటువంటి సినిమాను ఏ విధంగా రూపొందించారో ఆ రహస్యాలు మీరు కూడా తెలుసుకోవాలంటే నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న 'ఆర్ఆర్ఆర్ – బిహైండ్ అండ్ బియాండ్'ని చూసేయండి. వర్త్ టు వాచ్ అండ్ ప్రిజర్వ్ ద డాక్యుమెంటరీ ఫర్ ది ఫ్యూచర్ కిడ్స్.

– ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.